
# సద్గమయ

**పాలపర్తి వేణుగోపాల్**




"నాలుగేళ్ల క్రితం మాలో ఎవ్వరికీ ఎవ్వరం ఏమీ కాము. ఇప్పుడు అందరం అందరికీ అన్నీను." పోస్ట్ మాన్ అప్పుడే ఇచ్చి వెళ్లిన ఉత్తరం పట్టుకుని సుతారంగా ఆడిస్తూ అన్నాడు రఘు.

కళ్లు పెద్దవిచేసి, 'అట్లానా' అన్నట్లు ఆశ్చర్యంగా తల పంకించింది శమంత.

"రఘు మధుకు అన్న; మధు వసంతకు తమ్ముడు..."

"వసంత రఘుకు భార్య!అంతేనా?" నవ్వుతూ పూర్తిచేసింది శమంత.

ఉత్సాహం ఒక్కసారిగా చచ్చిపోయినట్లయిన రఘు, సమాధిలో ఉన్నట్లు పలికాడు: "ఆఁ!" నిర్వేదపు అలలు చెవిన [illegible]లలాగా ఆ స్వరం గద్గద మయింది. నీరసంగా కవరు టీపాయ్ మీద పెట్టాడు.

"లేవండి. ఉత్తరం తరవాత చదువుకోవచ్చు — అలా కాలవ ఒడ్డుకు వెళదాము ... రారూ?" సోఫాలో నుంచి లేచి, సరదాగా బుంగ మూతి పెట్టి చిన్నగా నవ్వింది శమంత.

అప్పుడే మేలుకున్నట్లు సందేహంగా, "ఆఁ?" అని, తనూ నవ్వి లేచాడు రఘు. నిప్పులో నీటిబొట్టు లాగా క్షణంలో హరించిపోయింది ఆ నవ్వు.

'తన నవ్వు తనకే వికారంగా ఉంది.'

లేచి, ఇంటికి తాళం వేసి, గాలిని అనుసరించే శబ్దంలాగా గంభీరంగా శమంత వెంట నడిచాడు రఘు.

'అనుకోకుండా వచ్చిన వసంతను గూర్చిన ప్రసక్తి తన ఉత్సాహం మీద వల విసిరింది.' రాజుకున్న ఆలోచనలు ఆవరించిన మెదడు ఆపలేకపోయింది: 'వసంత నిజంగా తనను మోసగించింది.

**జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు తెలిసో తెలియకో తప్పుచేయని మనిషి ఉండడు. సానుభూతితో కారణాలను అన్వేషించి, మానవ సహజమైన బలహీనతను అర్థం చేసుకొని, తన తప్పును ముఖ్యంగా ప్రాణానికి ప్రాణమైనవారు మన్నించాలని, తిరిగి తనను హృదయపూర్వకంగా స్వీకరించాలని కోరుకొనని వాడూ ఉండడు. అదే తప్పు ఎదుటి వాడు చేస్తే భిన్నమైన కోణంలోంచి చూడడం ఎందుకు జరుగుతుందో, ఏఁ?**

కమ్మని పూలలో విహరిస్తూ, తియ్యని తేనెను తన చుట్టూ పెంచుకుని, అవకాశం వచ్చినప్పుడు ముల్లును ఉపయోగించే తేనెటీగ లాటిది వసంత.' ఆలోచనల ఆకాశంలో వసంత తీక్షణంగా వెలుగుతున్నది.

'వేదాంత తత్త్వంకన్నా, అధివాస్తవిక చిత్రం కన్నా అర్థం కానిది స్త్రీ మనసు. తల్లిదండ్రులను విడిచి, అంతదాకా ముక్కూ మొహం తెలియని వ్యక్తిని భర్తగా గ్రహించి అతనిలోనే చూచుకోవటం అనే విచిత్ర శక్తిని స్త్రీకి ప్రకృతి ఇచ్చింది. ఆ వరాన్ని శాపంగా మారుస్తుంది గర్వం. వసంత విషయంలో అదీ నిజమయింది.' సాయంసూర్యుడి ఎర్రదనంలాగా దట్టంగా మనసులో ఆలోచనలు అల్లుకున్నాయి.

'నాలుగేళ్లుగా తనతో ఉన్న అనుబంధాన్ని గాలికి వదిలి, వసంత ఎక్కడికి వెళ్లింది?'

ముందు నడుస్తున్న శమంతను చూచాడు రఘు. తనూ సాగుతున్న ఆలోచనలతో ముందుకు సాగుతున్నది.

'సరిగా పది రోజుల క్రితం తన ఇంట్లోకి వచ్చి, "అద్దెకు ఇళ్లేమైనా ఖాళీగా ఉన్నాయా, ఇక్కడ?" అని అడిగింది శమంత. ఆనాటి దాకా శమంత ఎవరో తనకు తెలియదు; తనను ఎన్నడూ శమంత చూడలేదు. తానే పక్క ఇల్లు చూపించాడు. ఈ కొద్దికాలంలోనే తమ పరిచయం విచిత్రంగా అభివృద్ధి చెందింది. ఒకరి కష్టసుఖాలు ఒకరు తెల్సుకున్నారు.'

కాలవగట్టు పచ్చని మనసు విప్పి పిలుస్తున్నది. ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు.

శమంత నోరు విప్పింది: "ఏమిటీ, ఆలోచిస్తున్నారు?"

"ఆఁ! ఏమీ లేదు." పొడిగా సమాధానం ఇచ్చాడు. 'శమంత పలకరింపులో ఎంత ఆత్మీయత ఉన్నది! తను ఏమి తలుచుకుని బాధ పడిపోతున్నాడో అనే ఆవేదన ఆ కంఠంలో ఉంది?'

"మీ మిత్రుడి ఉత్తరం చదవనివ్వలేదని కోపమా?"

"అబ్బే!" మనస్ఫూర్తిగా అన్నట్లే అన్నాడు. 'మధు ఉత్తరం చదవకుండా తనను ఆపే శక్తి శమంతకు ఎలా వచ్చింది? వసంత ఏ నాడూ తనమీద అంత ప్రభావం నెరపలేదు!'

"ఏమో, బాబూ! మీ రేదో ఆలోచించుకుంటూ కూర్చుంటే నాకేం తోచటం లేదు."





## హ్యూలెట్స్ మిక్స్చర్ జీర్ణశక్తికి ఉపకరిస్తుంది.

మీరు అజీర్ణంతో బాధపడుతున్నారా!
కడుపునొప్పి ఎక్కువగా వున్నాదా? అందువల్ల
అసౌకర్యంగా వుంటుంది. ఏకాగ్రత లోపిస్తుంది.
అకారణంగా కోపం వస్తుంది.

వెంటనే హ్యూలెట్స్ మిక్స్చర్ తీసుకోండి. అది చాలా త్వరగా.
శక్తివంతంగా పనిచేసి కడుపునొప్పిని తొలగిస్తుంది.

అది కడుపులోపల—రక్షణ కవచంవంటి ఒక
పొరను కల్పిస్తుంది. ఆమ్లపదార్థాలని నిర్మూలించి,
ఆహారం సులభంగా జీర్ణమవడానికి తోడ్పడుతుంది.
హ్యూలెట్స్ మిక్స్చర్ పిల్లల జీర్ణకోశ
వ్యాధులకు కూడా చాలా మంచిది.

విరేచనాలని అరికట్టడానికి హ్యూలెట్స్ మిక్స్చర్ (నల్లనిమూత) వాడండి

సి. జె. హ్యూలెట్ అండ్ సన్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
150-A/2, మౌంటు రోడ్డు, మద్రాసు-2

CJH-6098 TEL

చిన్న నవ్వు నవ్వి, శమంత కళ్లలోకి చూస్తూనే పరధ్యానంలోకి జారిపోయాడు రఘు.

'వ్యక్తికీ, వ్యక్తికీ మధ్య ఎంత వ్యత్యాసం! వసంతలో ఉన్న ఆకర్షణ శమంతలోనూ ఉంది. శమంతలో ఉన్న సహృదయత వసంతలో లేదు. కానీ, ఇద్దరికీ జీవితంలో ఒకే స్థితి ఎదురు కావటం విచిత్రంగా ఉంది.' శమంత మనసుతో చెలగాట లాడి బాధించిన ఆమె భర్త తత్త్వం గూర్చి ఆశ్చర్య పడ్డాడు రఘు.

త్రాగుబోతులాగా క్షణక్షణానికీ తూలిపోతున్నాడు సూర్యుడు.

'తాను శమంతను పెళ్లిచేసుకుంటే!' ఒక్కసారి గుండె జల్లుమంది.

ఒక్క క్షణం వాస్తవంలోకి వచ్చి చూపులు మరల్చుకుని మళ్లీ ఊహల మబ్బుల్లో కూరుకుపోయాడు. 'ఔను. తప్పక చేసుకోవాలి. శమంత కూడా ఒప్పుకోవచ్చు. కాఠిన్యంతో విరిగిన మనసును అనురాగంతో అతకవచ్చు. శమంతతో తన జీవితం పుష్పిస్తుంది. వసంత నుంచి తాను పొందింది ఆనందాభాస మాత్రమే ... వసంత! ... వసంత కూడా ఇదే స్థితిలో ఉంటే?'

భావ వీథిలో వసంత అడుగు పెట్టటంతో రఘు ఊహాల వెన్నుపూస విరిగింది. 'తనను వివాహం చేసుకుని ఉద్ధరిస్తానంటున్న మరొక వ్యక్తితో వసంత!' వసంత తన వైవాహిక ధర్మం నుంచి చ్యుతి పొందనున్నట్లు భావన కలిగింది. ఇప్పుడో, ఇంకాస్తసేపటికో పేలిపోతుం దన్నంతగా తల వేడెక్కింది. అర చేతితో నుదురు అదుముకున్నాడు.

'శమంత! ... శమంత స్థితి కూడా అదే కదా?' రఘు ఆలోచనలకు మొన దేలిన ఎదురురాయి తగిలింది.

'కాదు. శమంత సహృదయానికి ఇది కానుక.' మనసు మొరాయించింది.

'వసంత తిరిగి తన దగ్గరకు వస్తే తాను క్షమించగలడా? అసంభవం. ఆ పని ఎవ్వడూ చేయలేడు. తనేమీ మానవాతీతుడు కాడు. అందరిలాగానే తనలోనూ బలహీనతలు ఉంటాయి.'

ఊహల వేడికి వ్యాకోచం చెందినట్లు ముఖం ఉబ్బింది.

చూచీ చూడనట్లే రఘు ముఖాన్ని ఆసక్తితో గమనిస్తున్నది శమంత.

స్తంభించిన గాలిలాగా అతడు బహు గంభీరంగా ఉన్నాడు.

పగిలి చెల్లాచెదురుగా పడ్డ చలవద్దాల ముక్కలలాగా మబ్బులు పరుచుకున్నాయి.

కాలవ నీటి చిరు తరగల్లో కార్తీక ప్రాత చంద్రుడు గజగజా వణుకుతున్నాడు.

"ఇక వెళదామా?" శమంత లేచి మన్నితంగా పిలిచింది.

రఘు లేచాడు.

ఆమె నడుస్తున్నది.

అతడు అనుసరిస్తున్నాడు.

'శమంతను క్షమించ గలిగిన తాను, వసంతను ఎందుకు క్షమించలేడు? దీనికి వారిద్దరి స్థితిగతుల్లో భేదం కన్నా వారిద్దరి ఎడా తన కున్న భావంలో భేదమే కారణమా? వసంత భార్యా ధర్మం నుంచి భ్రష్టురాలయిందని తాను తలుస్తూ శమంతకు అంతకన్నా ఉన్నత స్థానం ఎందుకు ఇస్తున్నాడు? వివాహ వ్యవస్థ వసంత మీద తనకు అధికారాన్ని ఇచ్చిందా? అది వసంతకు తనమీద ఎందు కివ్వలేదు? స్త్రీని అబలను చేసి బలహీనత్వం ఆధారంగా పురుషుడు ఆడిన నాటకం తరతరాల సంప్రదాయంగా మనసులో స్థిరపడి పోయిందా?'

నిప్పును ఆశ్రయించిన కర్రలాగా ఆలోచనను ఆశ్రయించిన మనసు మండిపోతున్నది.

'తానుకూడా మానసికంగా పతితుడు. తనను తాను క్షమించుకుని, వసంతను క్షమించ ననటానికి తన కున్న ప్రత్యేకాధికారం ఏమిటి? తను చెయ్యలేని పనిని మరొకరు చేయాలని ఆశించటం స్వార్థం, రాక్షసత్వం కాదూ?' సంఘర్షణ తారస్థాయి నందుకుంది.

అత్యంతోన్నతమైన ఆదర్శాల శిఖరంమీద కాలు జారింది. పశ్చాత్తాపంతో చేయి చాపితే భగవంతుడు ఆలంబనం ఇస్తాడు. లేకపోతే అగాధమైన చీకటి లోయ అందుకుంటుంది.

రఘు ఒక నిశ్చయానికి వచ్చాడు.


తలనొప్పా? ఫ్లూ?

# శాలోఫెన్

బాధానివారిణి మాత్రలు

చప్పున, చల్లగా మీ బాధని పోగొడ్తాయి

**శాలోఫెన్**
ఉన్నచోట బాధ ఉండదు




శాలోఫెన్ మాత్రలు ఇప్పుడు విరివిగా దొరుకుతున్నాయి. తలనొప్పి, పంటినొప్పి, జ్వరలక్షణాలు, కండరాలనొప్పి - వీటికి శాలోఫెన్ వాడిచూడండి. శాలోఫెన్ మాత్రలు పెద్దవి, గుణంలోకూడా గొప్పవి. శాలోఫెన్ మాత్రల తయారుకి వాడబడే ఉత్తమ ఔషధోత్పత్తి ప్రమాణాలు ప్రపంచమంతటా డాక్టర్లు సిపారసు చేసేవే.

ఇదే అమృతాంజన్ లిమిటెడ్ వారి తయారింపే అని గుర్తుంచుకోండి.

అమృతాంజన్ లిమిటెడ్ మద్రాసు-4

FDSAS1081TEA

'వసంత తిరిగి ఎప్పుడు వచ్చినా, ఏ పరిస్థితిలో వచ్చినా తాను మనసారా ఆహ్వానించగలడు; గ్రహించగలడు.' ఆలోచనల మంటలు గుండెలను మండించి, మనసును పవిత్రీకరించాయి.

'కానీ, ఆమె రాదు. తన వసంతం — తన వసంత తనకు దూరమయింది. కాదు — తానే దూరం చేసుకున్నాడు.' మెదడులో గ్రీష్మపు గాలి దుమారాలు రేగుతున్నాయి.

'ఇక తనకు మిగిలింది మధు. మధు ఏమి వ్రాశాడో! మధు ఉత్తరం కూడా చదవకుండా శమంత వెంట వెళ్లటానికి కారణమైన తన వ్యామోహం తలుచుకుని రఘు కుంచించుకుపోయాడు.

ఆలోచనలలో దూరం తరిగింది.

"నేను వస్తాను" అన్న శమంతకు చూపుతోనే సమాధానం చెప్పి, త్వరత్వరగా తలుపు తీసి, లైటు వేసి, కవరు చించి కాగితం విప్పుతూ సోఫాలో కూర్చున్నాడు.

ఆ అక్షరాలు కురుస్తున్న ఆత్మీయతను కళ్లతో జుర్రుకుంటున్నాడు రఘు.

"అన్న రఘుకు —

అభినందనలు.

చాలాకాలంగా నీ నుంచి ఉత్తరం లేదు.

త్వరలో నేను పెళ్లి చేసుకోబోతున్నాను. ముహూర్తం నిశ్చయంకాగానే వ్రాస్తాను. తప్పక వస్తావు కదూ?

సరే కానీ, అక్క ఎక్కడ ఉంది?"

మబ్బులేని ఈ పిడుగుకు ఉలిక్కిపడ్డాడు రఘు.

"అనుకోకుండా నా నుంచి వచ్చిన ఈ మాటి ప్రశ్నకు నీకు ఆశ్చర్యం కలగవచ్చు. అసలు వీడికి ఎలా తెలుసు అనే అనుమానం కూడా కలగవచ్చు. నాకు తెలుసు. అంతేకాదు, నాకు మరొక విషయం కూడా తెలుసు."

నొసటి మీది చిరుచెమటను అప్రయత్నంగా తుడుచుకున్నాడు రఘు.

"నా ప్రశ్నకు నీవు సమాధానం చెప్పలేవని కూడా తెలుసు. నేను చెప్పగలను."

రఘు చూపులు ఉత్తరంలోని పంక్తులన్నిటినీ ఒక్కసారిగా కబళించాలని ఆత్రంగా పరుగెత్తుతున్నాయి.

"అక్క ఉంది. ఇక్కడే ఉంది. నా దగ్గిరే ఉంది!"

ఆనందంతో కనురెప్పలు బరువుగా వాలగా, సంతృప్తిగా ఒక్కసారి గాలి పీల్చి వదిలాడు రఘు.

"నాకు ఒక అహంకారం ఉండేది, అన్నయ్యను నేను అర్థం చేసుకున్నాను —అని. అక్క మాటలు విని, ఆ అహంకారం భ్రమ అని తెల్సుకున్నాను. వ్యక్తిత్వానికి అన్నయ్య విలువ ఇవ్వడని నేను ఇంతదాకా అనుకోలేదు. భర్త కావటంతో మగవాడికి ఒక అధికారం వస్తుందని అన్నయ్య అభిప్రాయపడతాడని నేను ఇంతదాకా ఊహించలేదు. వైవాహిక జీవితంలో భార్యాభర్తల సమానత్వాన్ని అన్నయ్య మన్నించడని నేను ఇంతదాకా భావించలేదు. నా అన్నయ్య తోటి మనిషిని అర్థం చేసుకునే మనసు లేనివాడని నేను ఇంతదాకా తలచలేదు. కానీ, నా ఊహ తలక్రిందయింది. అంచనా తారుమారయింది. ఈ తమ్ముడు అన్నయ్యను చదవలేక పోయాడని చాలా బాధగా ఉంది. నిజంగా చాలా బాధగా ఉందిరా!"

ఉత్తరం చదువుతుంటే, మనసులో పుట్టుతున్న భావాలకు రఘు ముఖం అద్దంలా ఉంది. గుడ్డిదీపంలాగా, చలిమంటలాగా, మునిమాపులాగా, వెన్నెలలాగా, అగ్నిశిఖలాగా, పట్టపగలులాగా ముఖంలో వేదన ఆవరించుకుంటూ ఉన్నది.

రఘు కన్నీళ్లు కుక్కుకున్నాడు. మెదడును కుళ్లగించినట్లు, గుండె మొక్కను నిర్దయగా పీకితే నరాల వేళ్లు తెగినట్లు ఉంది. ముఖం జేవురించింది. 'సూర్యుడి ముందు దీపంలాగా, దీపంముందు చీకటిలాగా, చీకటి ముందు కాటుకలాగా తన జీవితం ఓడిపోయింది. తెరవని కన్నులాగా, కురవని మబ్బులాగా — పెరగని తన మనసు దండగ. ఆవేశపు అగ్ని ఆశయాల గంధంచెక్కను అజ్ఞానపు మసిగా మార్చింది. ఇక దానికి గుబాళింపు లేదు. వసంత తనను క్షమించలేదు. ఆమె అంచనాల వర్ణచిత్రం తన అవివేకపు నీటిలో తడిసి, వికృతంగా మారిపోయి ఉంటుంది.' బాధగా ఉత్తరం మీదికి కళ్లు మళ్లాయి.

"అయినా, ఇంకా నాలో ఒక్క నమ్మకం మాత్రం చావలేదురా! అన్నయ్య ఎప్పుడో ఒకప్పుడు వాస్తవం గ్రహించకపోడు. అప్పుడు అన్నయ్య అమృత స్వరూపుడు. అదే ఆశ వసంతకు కూడా! అదే ఆమె బతుకు నావకు లక్ష్యంగా ఉంచుకున్న దీపం.



సహజ సౌందర్యం ఫోటో — వై. ప్రభావతి

నీతో నమ్మకం ఉంచిన. . .

—తమ్ముడు, మధు."

ఎడారిలో గాలివాన వచ్చినట్లు ఆనందమో, ఆవేదనో తెలియరాని భావం రఘును ఉక్కిరి బిక్కిరి చేసింది.

'వసంత! మధు! వసంత! మధు!' మత్తుగా అనుకున్నాడు రఘు. హృదయ తంత్రులను శ్రుతిచేస్తే వచ్చిన శబ్దంలాగా, బయటికి వచ్చిరాని ఆ అక్షరాలు కలమధురంగా ముని పెదవుల మీద లాస్యం చేశాయి. 'తన జీవిత కుసుమానికి ఒకరు సౌందర్యం, మరొకరు సుగంధం సంతరించిపెట్టారు. గాలిని విడిచి బ్రతుకు సాగిద్దామనుకున్నంత బుద్ధిహీనతకు లోబడ్డాడు తాను. చేజార్చుకున్న మనుగడ తననే వెతుక్కుంటూ వచ్చింది. నిజంగా తాను చాలా అదృష్టవంతుడు.' రఘు కళ్లు ఆనందంతో తడిశాయి; హర్షంతో మెరిశాయి.

'తనకు మధుతో, వసంతతో మొట్టమొదటి పరిచయం యూనివర్సిటీలో క్లాస్‌మేట్స్‌గా. మధు తనకు హాస్టల్లో రూమ్‌మేట్ కూడా అయ్యాడు. తరవాత తానూ, మధూ సహప్రేమికులు!' గమ్మత్తుగా, తియ్యగా నవ్వుకున్నాడు రఘు. 'ఇద్దరూ వసంతనే ప్రేమించారు. వసంత హృదయం తెలుసుకున్న తరవాత పొరపాటు గ్రహించి, మనస్ఫూర్తిగా వసంతకు అన్నయ్య అయినాడు మధు. మధు మీద తనకు ఈర్ష్య లేకపోవటం తన గొప్పతనం కాదు. అటువంటి వాతావరణాన్ని సృజించగలిగిన మనస్స్వచ్ఛత వాడిది. అగాధమైన వాడి హృదయాన్ని చదవగలిగినవాడికే ఈ బాంధవ్యం అర్థమవుతుంది. ఇది లోకానికి భిన్నం కాదు; విరుద్ధం కాదు — అతీతం! హృదయానికి తప్ప మేధాశక్తికి అందని అలౌకికానందం వంటిది. అనుభూతికి తప్ప అనుభవానికి అందని సంస్కార జ్యోతి అంతర ప్రకాశం. అందుకే మధుతో తనకు ఇంత అనుబంధం. తనలో చైతన్యం కలిగించి ఆ బంధాన్ని మరీ గాఢం చేశాడు.'

రఘుకు ఆనందం ఆగింది కాదు.

మనసులో అనుకుంటున్నట్లే అన్నాడు: "నాలుగేళ్ల క్రితం మాలో ఎవ్వరికీ ఎవ్వరం ఏమీ కాము. ఇప్పుడు అందరం అందరికీ అన్నీను. రఘు మధుకు అన్న; మధు వసంతకు తమ్ముడు..."

"మధు శమంతకు కాబోయే భర్త; శమంత వసంతకు చెల్లి!" అప్పుడే లోపలికి అడుగు పెట్టిన శమంత చిరునవ్వుతో అందుకుంది.

ఆశ్చర్యంతో సతమతమైన రఘు తేరుకుని మనస్ఫూర్తిగా పూర్తిచేశాడు: "వసంత రఘుకు ప్రాణం." ★